సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 28 । నవంబర్ । 2023



ఆడుదాం.. అందరం

క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడా సంబరాలు నిర్వహించనుంది.

8లో ▸



పాడి రైతుల ధర్నా

సంగం డెయిరీ సిబ్బంది తమపై దాడి చేశారని, న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద పాడి రైతులు ధర్నా చేశారు.

8లో ▸



తిరువీధి సేవ

ద్వారకాతిరుమల: కృత్తిక దీపోత్సవాన్ని పురస్కరించుకుని చినవెంకన్న తిరువీధి సేవ నేత్రపర్వంగా జరిగింది. ఇంటింటా భక్తులు నీరాజనాలు అర్పించారు.

న్యూస్‌రీల్

నేడు కొత్తపల్లి సబ్‌స్టేషన్‌కు సీఎం శంకుస్థాపన



పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే

గణపవరం: గణపవరం మండలం కొత్తపల్లి గ్రామం వద్ద రూ.61 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోమవారం తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గణపవరం మండలంలో విద్యుత్ సమస్యలు, ఆక్వా చెర్వులకు కరెంటు కొరత తీర్చడానికి మరో సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని గతేడాది మే నెలలో ఇక్కడకు వచ్చిన సీఎం జగన్‌ను కోరామన్నారు. ఈ మేరకు రూ.61 కోట్లు మంజూరు చేశారని, స్థల సేకరణ, పరిపాలనాపరమైన అనుమతులు, ఇతర కార్యక్రమాలన్నీ పూర్తి కావడంతో నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారన్నారు. వరదరాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సభా కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటలకు సీఎం జగన్ వర్చువల్‌గా పనులు ప్రారంభిస్తారన్నారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, విద్యుత్ ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు.

గోపవరంలో..

కైకలూరు: మండలంలోని గోపవరంలో ట్రాన్స్‌కో ద్వారా రూ.42.92 కోట్ల అంచనాలతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మంగళవారం సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. కైకలూరు వైఎస్సార్‌నగర్‌లో శిలాఫలకం ప్రారంభ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, విద్యుత్ అధికారులు హాజరుకానున్నారు.

సోమారామంలో నిత్యాన్నదానానికి చర్యలు



ధర్మకర్తలతో మాట్లాడుతున్న ఆర్‌జేసీ సురేష్‌బాబు

భీమవరం: పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం)లో నిత్యాన్నదానానికి చర్యలు తీసుకోవాలని దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎంవీ సురేష్‌బాబు అన్నారు. సోమవారం ఇక్కడ స్వామివారిని దర్శించి ధర్మకర్తలతో మాట్లాడారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో మాట్లాడి కార్తీకమాసం మాసశివరాత్రి రోజున నిత్యాన్నదానాన్ని ప్రారంభిస్తే బాగుంటుందని సూచించారు. రూ.50 లక్షల డిపాజిట్‌తో నిత్యాన్నదానం చేపట్టడానికి ఇబ్బంది ఉండదన్నారు. అన్నదానానికి దాతలు కూడా ముందుకు వస్తారన్నారు. పంచారామక్షేత్రాలను దర్శించుకునే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున భీమవరంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు నాచు శ్రీవల్లి, చెల్లబోయిన సూర్యప్రకాష్, నల్లం రఘుబాబు, తాణాల రామకృష్ణ, కుర్మదాసు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.89.17 లక్షల ఆన్‌లైన్ మోసం

జంగారెడ్డిగూడెం: ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. జంగారెడ్డిగూడెంకు చెందిన మహంకాళి దేవనాగ వెంకట రాఘవేంద్రపవన్ రాజేష్‌కు ఓ నంబర్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చిందని, ఆ మెసేజ్‌లో టాస్క్ పూర్తి చేస్తే రూ.50 వస్తుందని ఉండగా, రాజేష్ టాస్క్ పూర్తి చేయగా సొమ్ములు కూడా వచ్చాయన్నారు. దీంతో రాజేష్‌ను టెలిగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారని, వారి చానల్ సబ్‌స్క్రైబ్ చేసి షేర్ చేయాలని సూచించగా, అలా కూడా చేయడంతో రూ.150 వచ్చిందన్నారు. తర్వాత సీబీఓఈ ఎక్స్ఛేంజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఒక అకౌంట్‌ను రిజిస్టర్ చేసి రూ.2 వేలు ఇన్వెస్ట్ చేయాలని సదరు నంబర్ నుంచి సూచన వచ్చిందన్నారు. దీంతో రాజేష్ ఇన్వెస్ట్ చేయగానే కొంత సొమ్ము వచ్చిందన్నారు. ఇలా రాజేష్ దఫదఫాలుగా రూ.89,17,093.20 ఇన్వెస్ట్ చేశాడని, సదరు సొమ్ములు కంపెనీ అకౌంట్‌లో కనిపిస్తున్నా విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం లేకుండా ఉందన్నారు. దీంతో తాను మోసపోయినట్టు గుర్తించి రాజేష్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఓం నమో శివరుద్రాయ

హరోంహర.. శంభోశంకర.. స్మరణలు మార్మోగాయి. నీలకంఠుడిని దర్శించేందుకు భక్తులు బారులు తీరారు. కార్తీక సోమవారం కావడంతో పంచారామ క్షేత్రాలకు పోటెత్తారు. పాలకొల్లులో క్షీరారామం, భీమవరం గునుపూడిలో సోమారామం, పట్టిసం వీరేశ్వరస్వామి క్షేత్రాలతో పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాల్లో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయాల్లో భక్తులు దీపారాధనలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



భీమవరం (ప్రకాశంచౌక్): ఉమాసోమేశ్వరస్వామి



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్‌లలో భక్తులు



పోలవరం రూరల్: పట్టిసంలో..



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామంలో అభిషేకాలు

ఎస్సీ శ్మశాన వాటికలకు స్థలాలు

దళితుల ఆత్మగౌరవం నిలబెట్టేలా..
- 'పశ్చిమ'లో ఇప్పటివరకు 229 గ్రామాలకు 135.98 ఎకరాల కేటాయింపు
- ఎకరా వరకు స్థలం
- ఆయా పంచాయతీలకు అప్పగిస్తున్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్సీ వర్గాలు



తాడేపల్లిగూడెంలో ఎస్సీ శ్మశాన వాటికకు సంబంధించి భూ కేటాయింపు పత్రాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): శ్మశాన వాటికి లేక ఇబ్బంది పడుతున్న ఎస్సీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దళితుల సంక్షేమంలో భాగంగా ఎస్సీ శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయిస్తోంది. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమం చురుగ్గా జరుగుతుంది. జిల్లాలోని 20 మండలాల్లో గ్రామాల వారీగా ఎస్సీ ప్రాంతాలను గుర్తించి ఎక్కువ శాతం ఎస్సీలు ఉన్న ప్రాంతాలల్లో శ్మశాన వాటిక లేకపోతే ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూమిని గుర్తించి వాటిని శ్మశాన వాటికల కోసం కేటాయిస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీలకు (పొజిషన్ హ్యాండ్‌ఓవర్) శ్మశాన వాటిక భూములను అప్పగిస్తున్నారు. వేగంగా భూమి గుర్తించడం అంతే వేగంగా ఆ భూమిని ఎస్సీ శ్మశాన వాటిక భూమిగా రికార్డుల్లో నమోదు చేసి పంచాయతీలకు అప్పగించడం జరుగుతున్నాయి.

ఎకరా వరకూ.. ఎస్సీ ప్రాంతాలకు ఎకరా వరకు భూమిని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో ఆయా గ్రామాల్లో భూమి ఎక్కువ ఉండి ఎస్సీ జనాభా ఎక్కువ ఉంటే 50 సెంట్ల నుంచి 1.25 సెంట్ల వరకు కేటాయిస్తున్నారు. భూమి తక్కువ ఉండి తక్కువ ఎస్సీలు ఉన్న ప్రాంతాలకు 20 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు కేటాయిస్తున్నారు.

యలమంచిలిలో అత్యధికం

జిల్లాలో ఇప్పటివరకు 229 గ్రామాల్లో ఎస్సీ శ్మశాన వాటికలకు 135.98 ఎకరాల భూమి కేటాయించారు. అత్యధికంగా యలమంచిలి మండలంలోని 15 గ్రామాల్లో 19.53 ఎకరాలు కేటాయించారు. తర్వాత పాలకోడేరు మండలంలో 11 గ్రామాలకు 14.59 ఎకరాలు, పెనుగొండ మండలంలో 16 గ్రామాల్లో 12.27 ఎకరాల భూ కేటాయింపులు జరిగాయి.

అంతటా హర్షం : శ్మశాన వాటిక లేక ఇబ్బంది పడుతున్న ఎస్సీ ప్రాంతాలకు ప్రభుత్వం భూమి కేటాయించడంపై దళితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఉన్న శ్మశాన వాటిక భూముల సమస్యలను పరిష్కరించి పూర్తి హక్కులతో శ్మశాన వాటికలకు కేటాయించడం, అలాగే నూతనంగా శ్మశాన వాటికలకు భూమి ఇచ్చేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చాలా సంతోషం



మా గ్రామానికి సంబంధించి ఎస్సీ శ్మశాన వాటిక సమస్య పరిష్కరించి 20 సెంట్ల భూమి కేటాయించారు. శ్మశాన వాటిక లేని ఎస్సీ ప్రాంతాలకు భూమి కేటాయించడం చాలా సంతోషం. ఎస్సీల శ్మశాన వాటికలకు భూమి కేటాయించడంతో పాటు భూములు ఉన్న ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– దిద్దే శ్రీనివాస్, జగన్నాథపురం, పోడూరు మండలం

మరో 11 గ్రామాలకు నివేదించాం



జిల్లావ్యాప్తంగా 229 గ్రామాలకు సంబంధించి ఎస్సీ శ్మశాన వాటికలకు 135.98 ఎకరాల భూమిని ఆయా పంచాయతీలకు పొజిషన్ చూపించాం. మరో 11 గ్రామాలకు భూమి అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. శ్మశాన వాటికకు భూమి లేని ఎస్సీ ప్రాంతాలన్నింటికీ కూడా స్థలాలు కేటాయించాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.రామసుందర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్

ఎస్సీ శ్మశాన వాటికలకు భూ కేటాయింపులు (ఇప్పటివరకు)

మండలం	గ్రామాల సంఖ్య	భూ కేటాయింపు (ఎకరాల్లో..)
కాళ్ల	11	7.09
పోడూరు	18	10.08
పెనుమంట్ర	14	8.02
మొగల్తూరు	14	8.59
పాలకొల్లు	15	7.36
పాలకోడేరు	11	14.59
ఉండి	10	3.58
నరసాపురం	11	4.46
యలమంచిలి	15	19.53
అత్తిలి	11	3.58
ఇరగవరం	8	4.03
తాడేపల్లిగూడెం	16	5.46
పెంటపాడు	13	6.98
భీమవరం	10	2.60
వీరవాసరం	15	5.26
గణపవరం	1	0.50
ఆచంట	10	6.43
తణుకు	5	2.51
పెనుగొండ	16	12.27
ఆకివీడు	8	2.46

'ఆడుదాం ఆంధ్రా' పోస్టర్ ఆవిష్కరణ



ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆడుదాం ఆంధ్రా వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. 15 ఏళ్లు పైబడిన వారికి ఆరోగ్యకరమైన జీవనశైలి, మంచి అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా క్రీడల్లో పాల్గొనేలా ప్రభుత్వం ఈ క్రీడోత్సవం నిర్వహించనుందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పురుషులు, మహిళలకు బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నారన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు 1902 నెంబర్‌కు ఫోన్ చేసి ఆన్‌లైన్ లేదా గ్రామ వలంటీర్ ద్వారా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యమన్నారు. పోటీల నిర్వహణకు నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి వ్యవహరిస్తారన్నారు. డీఆర్వో శివన్నారాయణరెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, డీఎస్పీ బండారు శ్రీనాథ్, హౌసింగ్ పీడీ ఆర్‌సీ ఆనంద్‌కుమార్, చీఫ్ కోచ్ దుర్గారావు పాల్గొన్నారు.

● మర్యాదపూర్వక భేటీ



తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఆయన తనయుడు సుందర్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం మోషేన్‌రాజు పుట్టినరోజు సందర్భంగా సీఎం జగన్ శుభాకాంక్షలు తెలిపారు.

- సాక్షి, భీమవరం

వచ్చేనెలలో సీఎం జగన్ పర్యటన

- భీమవరం నుంచి జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల
- మొదటి వారంలో ముఖ్యమంత్రి రాక

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిసెంబర్ మొదటి వారంలో భీమవరంలో పర్యటించనున్నారు. విద్యార్థులకు సంబంధించి జగనన్న విద్యా దీవెన పథకంలో నిధులను భీమవరంలో బహిరంగ సభావేదికగా బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. సీఎం జగన్ పర్యటన ఖరారు కావడంతో హెలీప్యాడ్, బహిరంగ సభకు అవసరమైన స్థలాలను సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి పరిశీలించారు. హెలికాప్టర్ దిగడానికి, బహిరంగ సభకు పట్టణంలోని మెంటేవారితోట సమీపన బైపాస్ రోడ్డు దగ్గరలోని ఖాళీ స్థలాలు, అలాగే బీవీరాజు కళాశాలలోని క్రీడా మైదానం తదితర ప్రాంతాలను వారు పరిశీలించారు. రూట్ మ్యాప్‌నకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) నుంచి క్లియరెన్స్ రావాల్సి ఉండటంతో ఎంపిక చేసిన ప్రాంతాల నివేదికను అధికారులు సీఎంఓ కార్యాలయానికి పంపించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో సీఎం జగన్ మూడు సార్లు భీమవరం వచ్చారు. అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు, రెండు సార్లు ప్రైవేట్ కార్యక్రమాలకు ఆయన ఇక్కడకు విచ్చేశారు. అలాగే 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా భీమవరం వచ్చారు. మరోమారు భీమవరం రానుండటంతో పర్యటన విజయవంతం చేసేందుకు ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి పటిష్ట ప్రణాళికలు రూపొందించే పనిలో ఉన్నారు. స్థలాల పరిశీలనలో భీమవరం ఆర్డీఓ శ్రీనివాసులరాజు, డీఎస్పీ బి.శ్రీనాథ్, సీఐలు అడబాల శ్రీను, గుత్తుల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లిబాబు, ఏఎస్ రాజు, కొల్లి ప్రసాద్, కడలి ధర్మారావు, చిన్నమిల్లి వెంకటరాయుడు, కోళ్ల బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



భీమవరంలో స్థలాలు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్

స్పందనకు 192 అర్జీలు



భీమవరం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనలో వచ్చే ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె 192 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకి చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల్లో అర్జీలపై ఆరా తీశారు. జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్ ద్వారా 1902 నంబర్‌కు ప్రజలు సమస్యలను తెలియజేస్తున్నారన్నారు.

అర్జీల్లో కొన్ని..
- భీమవరం మండలం దిరుసుమర్రుకు చెందిన గుత్తుల సుజాత తన తాతకు చెందిన భూమికి తాను వారసురాలినని, భూమి ఇప్పించాలని అర్జీ అందజేశారు.
- పాలకొల్లు మండలం పూలపల్లి నివాసి కొలుకులూరి జయప్రకాష్ తమ ఇంటి పరిసరాల్లో ఇటుక బట్టీ కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని కోరారు.
- ఆచంట మండలం పెదమల్లం నివాసి బీర బోసు తమ గ్రామంలో ఓ వ్యక్తి పంచాయతీ కుళాయికి మోటార్‌ను బిగించి తాగునీటిని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.
- అత్తిలి మండలం ఆరవల్లి నివాసి సత్తి సత్యనారాయణరెడ్డి తన భూమిని 15 ఏళ్ల క్రితం విక్రయించానని, వెబ్ ల్యాండ్‌లో లింక్ అయిన తన ఆధార్ నంబర్‌ను తొలగించాలని అర్జీ అందజేశారు.
- నరసాపురం మండలం సరిపల్లికి చెందిన జి.దిలీప్‌కుమార్ తన ఇంటి పక్కన స్థలాన్ని కొందరు ఆక్రమించి పందులు పెంచుతున్నారని, దుర్వాసన భరించలేకపోతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో శివన్నారాయణరెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, డీఎస్పీ బి.శ్రీనాథ్, అధికారులు పాల్గొన్నారు.

నేడు కైకలూరులో 'సామాజిక' బస్సు యాత్ర

కైకలూరు: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర మంగళవారం కైకలూరులో జరగనుంది. ఈ మేరకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 గంటలకు కైకలూరు శ్యామలాంబ ఆలయం వద్ద సాధికార బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు సీతారామ ఫంక్షన్ హాలులో జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అనంతరం బీసీ నాయకులతో సమావేశం నిర్వహిస్తారు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3 గంటల వరకు ఫంక్షన్ హాలులో విలేకరుల సమావేశం, అనంతరం ర్యాలీగా వెళ్లి సంత మార్కెట్ వద్ద సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలో మంత్రులు, నాయకులు ప్రసంగిస్తారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, విడదల రజనీ, జోగి రమేష్, పినిపే విశ్వరూప్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యేలు కొడాలి నాని, పేర్ని నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎమ్మెల్సీలు తదితరులు హాజరుకానున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు : సాధికార యాత్ర నేపథ్యంలో ఏలూరు నుంచి కైకలూరు మీదుగా భీమవరం వెళ్లే వాహనాలను వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి వయా వరహాపట్నం, శీతనపల్లి, ఉప్పుటేరు మీదుగా ఆకివీడు మళ్లించనున్నారు. భీమవరం నుంచి వచ్చే వాహనాలు ఆటపాక నుంచి వరహాపట్నం వయా గోపవరం మీదుగా కలిదిండి గేటు ఏలూరు రోడ్డు మీదుగా వెళతాయి. ఏలూరు డీఎస్పీ ఆధ్వర్యంలో ఏడుగురు సీఐలు, 10 మంది ఎస్సైలు, 220 సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేసినట్టు పట్టణ సీఐ ఆకుల రఘు చెప్పారు.



కైకలూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాట్లు

క్లుప్తంగా

స్పందన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలి



స్పందనలో ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

భీమవరం: స్పందనలో అందిన ఫిర్యాదులపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం వాటిపై పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 23 ఫిర్యాదులు అందగా, వాటిలో ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దు గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఒక యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. చిన్నవారిగూడెంకు చెందిన గెల్లా సాయిబాబా అనే యువకుడు ఐదో తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలిక ఆదివారం సైకిల్‌పై వెళుతుండగా, ఆపి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిపారు. బాలిక ఇంటికి వెళ్లి విషయాన్ని తల్లికి చెప్పగా, ఆమె సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆడుదాం.. అందరం

- డిసెంబర్ 15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు
- ప్రతి సచివాలయం పరిధిలో ఐదు క్రీడాంశాల్లో పోటీలు
- ప్రారంభమైన క్రీడాకారుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- ప్రతిభను వెలుగులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)





వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

బుట్టాయగూడెం: మారుమూల పల్లెల్లోనూ యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి వారిని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 'ఆడుదాం ఆంధ్రా' (ఇది అందరి ఆట) పేరుతో గ్రామీణ స్థాయి నుంచి క్రీడా సంబరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాలోని క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను డిసెంబర్ 15 నుంచి 2024 జనవరి 26 వరకు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడాకారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఇప్పటికే ప్రతి సచివాలయం పరిధిలో క్రీడా సామగ్రి పంపిణీ చేపట్టారు. 15 ఏళ్ల పైబడిన వారందరూ పాల్గొనేలా వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో వంటి ఐదు రకాల క్రీడల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సీనియర్ సిటిజన్స్‌కూ అవకాశం

ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో 15 ఏళ్లకు పైబడిన బాల బాలికలు, మహిళలు, పురుషులు, సీనియర్ సిటిజన్స్ సైతం పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. ఆటల్లో పాల్గొనే క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయాలకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్నారు. సచివాయ స్థాయిలో బేసిక్, నియోజకవర్గ స్థాయిలో ప్రొఫెషనల్ క్రీడా సామగ్రి పంపిణీ చేయనున్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు టీషర్ట్, క్యాప్, ఫ్రిస్ట్ బ్యాండ్ జిల్లా రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్ అందజేయనున్నారు. ఈ ఆటల పోటీల నిర్వహణకు సంబంధించి సీనియర్ క్రీడాకారులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయుల సేవలను వినియోగించనున్నారు. క్రీడలకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేసి ఆటల పోటీలను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని సాప్ అధికారులు తెలిపారు.

506 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో..

జిల్లాలో 506 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 10120 జట్టుల క్రీడాకారులు పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో ఒక్కో క్రీడకు ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళల జట్లు పాల్గొనేలా చూడాలని అధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో ప్రతి క్రీడకూ ప్రతి సచివాలయం పరిధిలో 20 జట్లు పాల్గొనే అవకాశం ఉంది. ఐదు రోజుల్లో క్రీడల ప్రక్రియ పూర్తి చేసి మండల స్థాయిలో 12 రోజులు, నియోజకవర్గ స్థాయిలో ఐదు రోజుల పాటు ఈ ఆటల పోటీలు నిర్వహించనున్నారు. అలాగే ఏడు రోజుల పాటు జిల్లా స్థాయిలో, మరో ఐదు రోజులపాటు రాష్ట్ర స్థాయిలో ఈ ఆటల పోటీలు జరగనున్నాయి.

అందరూ పోటీల్లో పాల్గొనాలి



రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూలేని విధంగా గ్రామీణ స్థాయిలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం చేపట్టింది. ఈ క్రీడలు ముఖ్యంగా గిరిజన ప్రాంత క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడతాయి. పోటీల్లో ప్రతి ఒక్క క్రీడాకారుడూ పాల్గొని ప్రతిభను చాటాలి.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

13 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్



వట్లూరులో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణి

పెదపాడు: ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాల్లో పాల్గొనే ఔత్సాహికులు తమ పేర్లను ఆన్‌లైన్లో రిజిస్టర్ చేసుకోవాలని ఇన్‌చార్జి కలెకర్ బి.లావణ్యవేణి అన్నారు. వట్లూరులో సోమవారం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను జేసీ ప్రారంభించి మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సోమవారం నుంచి నమోదు ప్రారంభమైందని, ఈ ప్రక్రియ డిసెంబర్ 13వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈనెల 27 నుంచి ఆన్‌లైన్‌లో లేదా 1902 నంబర్‌కు కాల్ చేసి లేదా గ్రామ, వార్డు సచివాలయంలో లేదా వలంటీర్ల ద్వారా డోర్‌టు డోర్ క్యాంపెయిన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ 15 నుంచి 22 వరకు జరిగే ఈ పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తామని, అనంతరం ఫిబ్రవరి 3న విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గరిష్టంగా రూ.5 లక్షల వరకు బహుమతులు అందిస్తామన్నారు.

లోగో, మస్కట్ ఆవిష్కరణ

ఏలూరు(మెట్రో): ఆడుదాం.. ఆంధ్రా లోగో, మస్కట్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలతో పాటు 3కే మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి సంప్రదాయ ఆటలను నిర్వహిస్తామని చెప్పారు.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రమేష్

పెనుగొండ: పెనుగొండలో అదృశ్యమైన ఓ బాలికను ఆమె తల్లిదండ్రులకు పోలీసులు క్షేమంగా అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. పెనుగొండకు చెందిన ఓ బాలిక పెనుగొండలో ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతోంది. శనివారం పాఠశాల బస్సు దిగి అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో బాలిక ద్వారకాతిరుమలలో ఉందని తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి బాలికను క్షేమంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. చదువుకోమని తండ్రి మందలించడం వల్లే మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు బాలిక పోలీసులకు తెలిపింది. తండ్రి షాపులో రూ.500, ముందుగా దాచి ఉంచుకున్న రూ.వెయ్యితో కలిపి వెంట తీసుకుని ముందుగా అనుకున్న ప్రకారం పాఠశాలకు వెళ్లేటప్పుడు మూడు జతల బట్టలను స్కూల్ బ్యాగ్‌లో పెట్టుకుని వెళ్లినట్లు ఎస్సై రమేష్ చెప్పారు. ముందుగా పాఠశాల నుంచి తణుకు వెళ్లి, అక్కడ నుంచి ద్వారకాతిరుమల చేరుకుని స్వామివారి దర్శనం చేసుకుంది. అక్కడ నుంచి ఎక్కడకు వెళ్లాలో తెలియక దేవాలయంలో నిద్రపోవడాన్ని గమనించిన తోటి భక్తులు పాపను చేరదీసి ఆరా తీయగా, తాను దారి తప్పిపోయానని, పెనుగొండ నుంచి వచ్చినట్లు చెప్పడంతో తమకు, తండ్రి ప్రసన్నకుమార్‌కు సమాచారం అందించారన్నారు.

సంగం డెయిరీ మోసంపై పాడి రైతుల ధర్నా



ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సంగం డెయిరీ పాడి రైతులు

ఏలూరు (టూటౌన్) : సంగం డెయిరీ దాడి చేసింది పాడి రైతులపైనే అని, డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర చేసిన మోసాన్ని ప్రశ్నిస్తే రాజకీయ రంగు పులుముతున్నారని పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగపాలెం మండలం రంగాపురం, ఆసన్నగూడెం, నర్సన్నపాలెం పెదవేగి మండలం వేగివాడ, మొండూరు తదితర గ్రామాలకు చెందిన పాడిరైతులు సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ గుంటూరు జిల్లా సంగం డెయిరీ ఉద్యోగులు తమ గ్రామాల్లో తిరిగి పాడి రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పాలు కొనుగోలు చేశారన్నారు. లీటరుకు రూ.80 చెల్లించడంతో పాటు 14 శాతం బోనస్ ఇస్తామని నమ్మించి దాదాపు సంవత్సన్నర కాలంగా పాలను డెయిరీకి పోయించుకున్నారన్నారు. అయితే బోనస్ ఇవ్వకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. ఈ విషయమై సంగం డెయిరీ మేనేజర్ జానకిరామయ్యను సంప్రదించగా, నాలుగు శాతం మాత్రమే బోనస్ ఇస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని ఆరోపించారు. ఈనెల 15న మరోసారి సంగం డెయిరీకి వెళ్లి చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రను కలిసే ప్రయత్నం చేయగా అక్కడి సిబ్బంది తమపై దాడి చేసి మారణాయుధాలతో హత్యాయత్నం చేశారన్నారు. దీనిపై తాము చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామన్నారు. పాలు పోసిన రైతులకు డబ్బులు ఎగ్గొట్టి నేడు పార్టీలు ఆపాదించటం ఎంతవరకూ న్యాయం అంటూ రైతులు ప్రశ్నించారు. టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర తన మోసాన్ని కప్పిపుచ్చటానికే రైతులపై పార్టీ ముద్ర వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేరు చెప్పి విషయాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని నరేంద్ర కుట్ర చేస్తున్నారన్నారు. సంగం డెయిరీకి పాలు పోసిన రైతుల్లో టీడీపీ, వైఎస్సార్ సీపీకి చెందిన వారు అందరూ ఉన్నారన్నారు. సంగం డెయిరీని అడ్డు పెట్టుకుని టీడీపీ నేత నరేంద్ర కోట్లాది రూపాయలు రైతులకు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. ఈ మోసాన్ని నిలదీస్తే గుంటూరులో తమపై దాడులు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సంగం డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ జేసీ లావణ్య వేణికి పాడి రైతులు స్పందనలో ఫిర్యాదు చేశారు. పాడి రైతుల ప్రతినిధి మునునూరి రాము, పాడి రైతులు ఎం.భాగ్యలక్ష్మి, వి.రాజేష్, ఎం.అప్పారావు, వి.వెంకటేశ్వరరావు, మునునూరి ప్రసాదరావు, ఎ.సురేష్, ఎ.అక్కయ్య, ఎస్.లక్ష్మి, మోర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: గోపినాథపట్నంలో భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాదిని కుమారి దంపతులు పూజలు నిర్వహించారు. సోమవారం భక్తాంజనేయస్వామిని ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామి వారికి విశేష పూజలు, నివేదనలు, కర్పూర నీరాజనం, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం వేదమంత్రోచ్చారణ, హనుమాన్‌చాలీసా పారాయణం, మంగళవాయిద్యాలు ధ్వజపతాకాలతో వివిధ కళాప్రదర్శనల నడుమ భక్తాంజనేయస్వామి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం



ఆకివీడు : మందపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

క్రీడలతోనూ ఉపాధి అవకాశాలు మెరుగు



భీమవరం డీఎన్నార్ కళాశాలలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: క్రీడలు మానసిక దారుఢ్యానికే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడటానికి దోహదం చేస్తాయని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు అన్నారు. కళాశాలో రెండు రోజులపాటు నిర్వహించిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ పురుషుల బ్యాడ్మింటన్, పురుషులు, మహిళల రోప్ స్కిప్పింగ్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతుల అందజేశారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బీవీ నర్సింహరాజు మాట్లాడుతూ వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పురుషుల రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌ను భీమవరం డీఎన్నార్ కళాశాల, మహిళల విభాగంలో కాకినాడ ఏఎస్‌డీ మహిళా ప్రభుత్వ కళాశాల, బ్యాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్‌లో ఏలూరు సర్ సీఆర్ రెడ్డి కళాశాల విన్నర్‌గా, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రన్నర్‌గా, తృతీయ స్థానంలో భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల, నాలుగో స్థానంలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల నిలిచాయని వివరించారు. కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు, అసిస్టెంట్ సెక్రటరీ కె.శివరామరాజు, ప్రిన్సిపాల్ బి.శాంతకుమారి, కె.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

పెదకాపవరంలో భారీ చోరీ



పెదకాపవరంలో ఇంటిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రవిప్రకాష్

ఆకివీడు : పెదకాపవరంలో తాళం వేసిన ఓ ఇంట్లో భారీ చోరీ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్న తల్లికి తోడుగా కుటుంబ సభ్యులు అక్కడే ఉండగా, సోమవారం దుస్తుల కోసం ఇంటికి వచ్చిన కుమారుడు తలుపులు తీసి ఉండటం గమనించి లోనికి వెళ్లి చూడగా బంగారం, వెండి నగదు అపహరణకు గురైనట్లు నిర్ధారించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో నివసిస్తున్న కట్రెడ్డి సత్యనారాయణ భార్య లక్ష్మికి అనారోగ్యంగా ఉండటంతో భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఈ నెల 24న చికిత్స కోసం చేర్పించారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు అందరూ ఇంటికి తాళం వేసి ఆస్పత్రి వద్దే ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం దుస్తులు తీసుకుని వెళ్లేందుకు ఆమె కుమారుడు శరత్ వికాస్ ఇంటికి వచ్చాడు. అయితే ఇంటి ప్రధాన ద్వారం తలుపులు తెరిచి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా బీరువాలు తెరిచి ఉన్నాయి. అందులో ఉండాల్సిన 31 కాసుల బంగారపు ఆభరణాలు, రెండు కిలోల వెండి ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సమాచారం అందుకున్న ఎస్పీ యు.రవిప్రకాష్ చోరీపై కుటుంబ సభ్యులు, స్థానికుల నుంచి వివరాలు ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగబాబు చెప్పారు.

జేసీబీ, రెండు టిప్పర్ల స్వాధీనం

ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లి శివారులోని ప్రభుత్వ భూమిలో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలను ఎస్సై టి.సుధీర్, రెవెన్యూ సిబ్బంది అడ్డుకుని ఒక జేసీబీ, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. జంగారెడ్డిగూడెం మండలం టెక్కినవారిగూడెంకు చెందిన ఒక వ్యక్తి ఈ తవ్వకాలను జరిపించి, మట్టిని వారి గ్రామానికి తరలిస్తున్నట్లు అధికారులు తేల్చారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఎస్సై తహసీల్దార్ పి.సతీష్‌కు సిఫార్సు చేశారు.

జగన్ ప్రభుత్వంలోనే బలహీన వర్గాలకు ప్రాధాన్యత



భీమవరం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపులకు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే గుర్తింపు లభించిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మోనటరింగ్ సెల్ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు స్పష్టం చేశారు. సోమవారం భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత బలహీనవర్గాలు, కాపులకు మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రి పదవులతోపాటు శాసన మండలి చైర్మన్ వంటి అత్యుత్తమ పదవులిచ్చారన్నారు. సీఎం వైఎస్ జగన్ పేదల పక్షాన ఉంటే చంద్రబాబు ధనికుల అండగా నిలిచారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన జగన్ రానున్న ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమని మంగరాజు స్పష్టం చేశారు. పి.బాలకృష్ణ, సీహెచ్ భరత్, చీర సునీల్‌బాబు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న హైవే నిర్వహణ

- ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతంలో ప్రమాదాలు
- నిత్యం మరమ్మతుల పేరుతో ట్రాఫిక్ మళ్లింపు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు
- చర్యలు తీసుకోవాలని వాహనదారుల విజ్ఞప్తి



ఉండ్రాజవరం జంక్షన్ జాతీయ రహదారిపై జరుగుతున్న నిర్మాణ పనులు

తణుకు: జాతీయ రహదారిపై చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణాలు... మరోవైపు జాతీయ రహదారి నిర్వహణ పనులు.. వెరసి వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. నిర్మాణం, నిర్వహణ పేరుతో సిబ్బంది అవలంభిస్తున్న తీరుతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారి అభివృద్ధి పనుల పేరుతో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. అయితే గత కొన్నేళ్లుగా మరమ్మతుల పేరుతో నిత్యం ట్రాఫిక్ మళ్లిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తద్వారా పలువురు వాహనదారులు మృత్యువాత పడుతుండగా పదుల సంఖ్యలో వాహనదారులు గాయాల పాలవుతున్నారు. మరోవైపు జాతీయ రహదారి నిర్వహణ పనులకు వినియోగిస్తున్న భారీ వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గతంలో తణుకు మండలం దువ్వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే నిర్వహణ వాటర్ ట్యాంకర్ వాహనం ఢీకొని పదో తరగతి చదువుతున్న బాలిక దుర్మరణం పాలైంది. పాత టోల్‌గేట్ సమీపంలో రోడ్డు నిర్వహణకు వినియోగిస్తున్న లారీను టిప్పర్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృత్యువాత చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పలువరు ఇటీవల మృతి చెందారు.

నిత్యం ట్రాఫిక్ మళ్లింపు..

పెనుగొండ మండలం సిద్ధాంతం నుంచి తాడేపల్లిగూడెం వరకు దాదాపు 50 కిలోమీటర్లు మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. జాతీయ రహదారి నిర్వహణ, మరమ్మతులు చేపట్టేందుకు దాదాపు రెండేళ్ల క్రితం ఒక కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. ఇందులో భాగంగా ఈ రోడ్డులో నిత్యం మరమ్మతులు చేస్తుండటంతో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. దీంతో రోడ్డుకు మధ్య భాగంలో ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటు చేస్తున్నారు. కిలోమీటర్లు మేర వీటిని ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మంగళవారం దువ్వలో జరిగిన ప్రమాదంలో రోడ్డు డివైడర్‌లో మొక్కలకు నీళ్లు పోసే వాటర్ ట్యాంకర్ వాహనం మోటారు సైకిల్ ను ఢీకొట్టడంతో బాలిక అక్కడిక్కడే దుర్మరణం పాలైంది. గతంలో డీమార్ట్ సమీపంలో సైతం మోటారు సైకిల్‌పై వెళుతున్న మహిళ రోడ్డు డివైడర్‌పై పడి మృతి చెందారు. పెరవలి మండలానికి చెందిన మరో వ్యక్తిని హైవే నిర్వహణ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద సిగ్నల్ వద్ద వేచి ఉన్న యువకుల మోటారు సైకిల్‌ను వెనుక నుంచి వాహనం ఢీకొట్టిన ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. ఇటీవల అలంపురం సెంటర్ వద్ద ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో తణుకు పట్టణానికి చెందిన మహిళ మృతి చెందగా ఆమె కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. దువ్వ జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో గొయ్యిలో పడి ఒక యువకుడు మృతి చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద డివైడర్ కోసం ఏర్పాటు చేసిన బోర్డును ఢీకొని వ్యక్తి మృతి చెందగా అదే ప్రాంతంలో తీసిన గొయ్యిన గమనించకపోవడంతో యువకుడు మృత్యువాత పాలయ్యాడు.

ట్రాఫిక్ మళ్లింపుతో ఇబ్బందులు

జాతీయ రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంతో నిత్యం మరమ్మతులకు గురవుతున్నా యి. దీంతో ఈ మార్గంలో నిత్యం రోడ్డు మరమ్మతులు చేస్తున్నారు. మరోవైపు పగలు సమయాల్లో మాత్రమే మరమ్మతు పనులు చేపడుతూ రోడ్డు మళ్లింపు చేపట్టాల్సిఉంది. అయితే జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది మాత్రం రాత్రి సమయాల్లో సైతం ట్రాఫిక్ కోన్స్ అలాగే వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కోసారి మరమ్మతు పనులు చేయకపోయినప్పటికీ రోడ్డు మార్గం మళ్లిస్తుండటంతో సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జాతీయ రహదారి ఆనుకుని గ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్వహణ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పడాల అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ప్రసాద వితరణ నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీకమాసం సందర్భంగా పడాల అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సోమసుందరేశ్వరస్వామికి విశేష పూజలు జరిగాయి. లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు కొప్పిశెట్టి రమణయ్య, మద్దూ కూరి మెహర్ ప్రసాద్, బోళ్ల రాము, వై.ఆంజనేయ స్వామి, కె.సత్యనారాయణ, దేవరాజ్ రెడ్డి, సూరిబాబు, జగదీష్, మునగాల జితేంద్రలు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా అంతరాయానికి ప్రజలు సహకరించాలని గూడెం ఎలక్ట్రికల్ డీఈ ఎన్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రోడ్డు మార్జిన్‌లో ఉన్న పాత స్తంబాలు శిథిలావస్తకు చేరిన కారణంగా కొత్త స్తంబాలు మారుస్తున్న దృష్ట్యా ముదునూరు, ఆకుతీగపాడు, ముక్తేపురం, రావిగుంట, తదితర గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు.

క్లుప్తంగా

వ్యాసరచనలో దండగర్ర విద్యార్థి ప్రతిభ



దండగర్ర జిల్లా పరిషత్ విద్యార్థిని లక్ష్మీనాగశైలజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం రూరల్: ఖాదీ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గిద్దా లక్ష్మీ నాగశైలజ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. దేశవ్యాప్తంగా ఈపోటీలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని శైలజను హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

గల్ఫ్ వెళ్లే మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమాబాల

భీమవరం: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే మహిళలు ఏజెంట్ల మోసాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల అన్నారు. భీమవరంలో సోమవారం నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. గల్ఫ్ ఏజెంట్లకు ప్రభుత్వం జారీ చేసిన రిజిస్టర్ రిక్రూటింగ్ లైసెన్స్ ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. ట్రస్ట్ జాతీయ అధ్యక్షురాలు లిస్సీ జోషఫ్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగ క్షేత్రాలను దర్శించుకున్న ఎమ్మెల్యే రంగనాథరాజు

పెనుమంట్ర: జిల్లాలో త్రిలింగ క్షేత్రాలుగా పేరుగాంచిన జుత్తిగ ఉమావాసుకి రవిసోమేశ్వరస్వామి, నత్తారామేశ్వరం రామలింగేశ్వర స్వామి, లక్ష్మణేశ్వరస్వామి ఆలయాలను సోమవారం కార్తీకమాసం పర్వదినం పురస్కరించుకుని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఏకకాలంలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో శ్రీరంగనాథరాజుకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, జుత్తిగ, నత్తారామేశ్వరం గ్రామాల సర్పంచ్‌లు తమనంపూడి వీర్రెడ్డి, వెలగల ధర్మారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కొవ్వూరి చిన్నారెడ్డి, పెనుగొండ ఏఎంసీ డైరెక్టర్ కర్రి రామారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి రామలింగేశ్వరరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి, తమనంపూడి అయ్యప్పరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, వైఎస్సార్ సీపీ మాజీ వైస్ చైర్మన్ గుడిమెట్ల మురళీసాయిరెడ్డి, కర్రి ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల రక్తదానం

నరసాపురం: ఎన్‌సీసీలో పనిచేయడం ద్వారా క్రమశిక్షణ, అంకితభావం అలవడతాయని నరసాపురం 7 ఆంధ్రా నేవల్ యూనిట్ కమాండర్ జి.భరత్‌భూషణ్ అన్నారు. నేవల్ యూనిట్‌లో సోమవారం 76వ ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండర్ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా ఎన్ఎసీసీలో చేరాలన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ద్వారా పలు ఉపయోగాలున్నాయని చెప్పారు. ముఖ్యంగా దేశానికి ఎలాంటి సేవలు చేయాలో అవగాహన కలుగుతుందని చెప్పారు. నరసాపురం ఎన్‌సీసీ నేవల్ యూనిట్ చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నరసాపురం, పెనుగొండ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు 30 మంది రక్తదానం చేశారు. నేవల్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెనుమంట్ర: ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మల్లిపూడి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల గోపాలకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ అందజేసిన చెత్తబుట్టలను గృహిణులకు అందజేసారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాలలో వేసి పరిసరాలను కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

వాకర్స్ క్లబ్‌కు విశిష్ట పురస్కారాలు

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్య, సామాజిక సేవా రంగాలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా వాకర్స్ క్లబ్, పాలకొల్లుకు విశిష్ట సేవా పురస్కారాలు లభించాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు లయన్స్ ఆడిటోరియంలో వాకర్స్ జిల్లా 201 వార్షిక ముగింపు సదస్సులో పాలకొల్లు వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ క్లబ్, ఉత్తమ ప్రెసిడెంట్, ఉత్తమ సెక్రటరీ అవార్డులు లభించాయి. వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు సుంకర రవీంద్ర, జిల్లా గవర్నర్ ఎస్ కృష్ణమూర్తి చేతుల మీదుగా అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ రావు, కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి ఉమాశంకరరావు అవార్డులు అందుకున్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలి



సభలో మాట్లాడుతున్న సర్పంచ్ తాడేపల్లి బేబి

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సర్పంచ్ తాడేపల్లి బేబి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం మండలంలోని కొమ్ముగూడెం, పట్టింపాలెం గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్ముగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సభలో సర్పంచ్ బేబి మాట్లాడారు. బీజేపీ నియోజకవర్గ కో–కన్వీనర్ రామగాని భాస్కర సత్యనారాయణ మాట్లాడుతూ కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా ఉచితంగా బియ్యాన్ని అందించి, అందరి ఆకలి తీర్చిందన్నారు. ఈ పథకాన్ని పొడిగించడం జరిగిందన్నారు. ముద్ర యోజన ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చిందన్నారు. అంతే కాకుండా పీఎం కిసాన్, విశ్వకర్మ యోజన, ఉపాధి హామీ వంటి ఎన్నో పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. వీటిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి బి.ఫణికుమార్, డాక్టర్ శ్రీహర్ష, పత్సా రామకృష్ణ, గ్రామ నాయకుడు నల్లూరి శ్రీనివాస్, డ్వాక్రా సీసీలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఓటరుగా నమోదు కావాలి

తాడేపల్లిగూడెం ఆర్డీవో కే.చెన్నయ్య



తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: నియోజకవర్గంలో 2024 జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్లు నిండినా, నిండనున్న యువతీ, యువకులు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తాడేపల్లిగూడెం ఆర్డీవో కే.చెన్నయ్య అన్నారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎన్‌రోల్‌మెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (స్వీప్) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా తిరిగి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చెన్నయ్య మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అందరూ ఓటరుగా నమోదు చేయించడంతో పాటు ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందన్నారు. అలాగే ప్రతి కళాశాలలోనూ ఎలక్టోరల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి, 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేస్తామన్నారు. గతంలో మాన్యువల్‌గా ఓటు హక్కు నమోదు ఉండేదని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లోనే ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. మండల ప్రత్యేక అధికారి ఎ.దుర్గేష్ మాట్లాడుతూ యువతీ, యువకులు ప్రతి ఒక్కరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, మున్సిపల్ ఆర్ఐలు కే.శ్రీనివాస్, జయరామ్, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు, మండల పరిషత్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలకు అండగా నిలవాలి

పెనుగొండ: బాలికల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ఐసీడీఎస్ పెనుమంట్ర ప్రాజెక్టు సీడీపీవో ఎ కృష్ణకుమారి అన్నారు. సోమవారం పెనుగొండ మేకా వారి వీధిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పెనుగొండ సెక్టార్ సూపర్‌వైజరు ఎం విజయకుమారి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచంలో అత్యంత విలువలు కలిగిన లిఖిత రాజ్యాంగం మన భారత రాజ్యాంగమని ప్రముఖ న్యాయవాది జీవీ సుబ్బారావు తెలిపారు. సోమవారం స్థానిక బీఆర్‌ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు.

వీరంపాలెం విశ్వేశ్వరస్వామికి విశేష పూజలు



ఆర్డీవో దంపతులను సన్మానిస్తున్న గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి

తాడేపల్లిగూడెం రూరల్: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ పీఠంలోని శ్రీవిశ్వేశ్వరస్వామిని తాడేపల్లిగూడెం ఆర్డీవో కే.చెన్నయ్య దంపతులు దర్శించుకున్నారు. తొలుత వారికి పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో దంపతులను శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవారి చిత్రపటం, శాలువాతో వెంకటరమణ శాస్త్రి ఘనంగా సత్కరించారు. కాగా, నవాబుపాలెం, కొండ్రుప్రోలు, కుంచనపల్లి, కృష్ణాయపాలెం, పెదతాడేపల్లి, నీలాద్రిపురం, అప్పారావుపేట, మాధవరం తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసి కనిపించాయి. ఈ సందర్భంగా స్వామివార్లకు అభిషేకాలను ఆలయ అర్చకులు జరిపించారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

ఘనంగా పాండురంగ స్వామి కల్యాణోత్సవం

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని కేపీపాలెం సముద్ర తీరంలో వేంచేసియున్నన్న రుక్మాబాయి సమేత పాండురంగస్వామి కల్యాణ మహోత్సవం, 14వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్తీమాస పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి కల్యాణాన్ని ఆలయ ధర్మకర్తలు అందే రంగారావు, కృష్ణవేణి దంపతుల కుటుంబ సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అందే కాశీ విశ్వేశ్వరరావు ధన సహాయంతో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పాండు రంగస్వామి కల్యాణం సందర్భంగా సాయంత్రం సాగర హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

పంట వ్యర్థాల్లోనే పోషకాలు

- తగలబెడితే బూడిదలో పోసిన పన్నీరు
- చివికితే మెండుగా పోషకాలు



తాడేపల్లిగూడెం మండలం దండగర్ర గ్రామంలో పంట వ్యర్థాలను చేలలోనే తగలబెట్టిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తాడేపల్లిగూడెం మండలంలో దాదాపు 25 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. సీజన్ పూర్తి కావడంతో దాదాపు 90 శాతం పైగా వరి కోతలు చివరి అంకానికి చేరుకున్నాయి. అత్యధికంగా కోత యంత్రాల ద్వారా వరి పనలను కోయడంతో పొలంలో మిగిలిన కాడలను కొందరు రైతులు తగలబెడుతున్నారు. దీనివల్ల భూమిలోని సూక్ష్మ పోషకాలైన నత్రజని, భాస్వరం వంటివి నశిస్తాయని పలువురు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా ప్రచారం చేసినప్పటికీ రైతుల తీరులో మార్పు రావడం లేదు. దీంతో విరివిగా రైతులు వరి కాడలకు నిప్పు పెట్టి భూమికి పోషకాలు అందకుండా చేస్తున్నారు. ప్రస్తుతం శీతాకాలం కావడంతో వాతావరణ కాలుష్యానికి తోడు, పొగ దట్టంగా అలుముకుంటుందని పలువురు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది మరింత ప్రమాదకరమని పేర్కొంటున్నారు.

భూమిలో కలియదున్నడం మేలు :

వరి కాండాలను నీటిలో నానబెట్టి దమ్ములో 150 కిలోల సూపర్ పాస్పేట్ కుళ్ల బెట్టడం మంచిదని పలువురు సూచిస్తున్నారు. లేదంటే డీ కంపోజర్ పిచికారి చేసినా ప్రయోజనం ఉంటుంది. దీనివల్ల భూమికి పోషకాలు లభిస్తాయన్నారు. భూమి సారవంతంగా మారడంతో పాటు సాగులో వినియోగించే పురుగు మందుల ఖర్చులను తగ్గించుకోవచ్చు. తద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

తగలబెట్టే విధానానికి స్వస్తి చెప్పాలి




రైతులు వరి పంట వ్యర్థాలను తగలబెట్టే విధానానికి స్వస్తి చెప్పాలి. తద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు వ్యర్థాలను దమ్ము చేయడం వల్ల భూమికి మరింత పోషకాలు లభిస్తాయి. ఈ విషయాలను రైతులు గుర్తించి, వ్యవసాయాధికారుల సూచనలను పాటించాలి.

– ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పెనుమంట్ర: క్రీడలలో జిల్లా విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం నెగ్గిపూడి వేణుగోపాల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మార్టేరు యూత్ బాస్కెట్‌బాల్స్ అసోసియేషన్ మానవత స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులకు ప్రభుత్వ సహాయంతో పాటు అవసరమైతే వ్యక్తిగత సహాయాన్ని అందజేస్తామనని ఆయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో నిర్వహిచిన రాష్ట్రస్థాయి అండర్–17 బాస్కెట్‌బాల్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించిన విజేతలైన విద్యార్థులను అభినందిస్తూ ట్రోఫీని అందజేసారు. ముందుగా మార్టేరుకు చెందిన ప్రముఖ క్రీడాకారుడు నర్సాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి వరలక్ష్మి దంపతుల ఉసిరిచెట్టు వద్ద పూజా కార్యక్రమాలు చేసారు. కార్యక్రమంలో విద్య మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి, పెనుగొండకు చెందిన ప్రముఖ వైద్యులు కలిదిండి రామచంద్రరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లం బులిరెడ్డి, మానవతా సంస్థ జిల్లా సభ్యులు కర్రి సత్యనారాయణమూర్తి, చిర్ల సూర్యనారాయణ రెడ్డి, బాణాల శ్రీనివాస్‌రెడ్డి, యూత్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, కర్రి మురళీ శ్రీనివాసరెడ్డి, ఎస్ సత్యనారాయణరెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు




తణుకు టౌన్: తేతలి సంపత్ వినాయకుని గుడివద్ద నిర్వహించిన కార్తీక దీపోత్సవం దృశ్యం



అత్తిలి: ఉమాసిద్దేశ్వరునికి అభిషేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం (టీటీసీ): వాసవి ఆలయంలో ఉమా చంద్రశేఖర్ స్వామి



కృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా తణుకు మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని సంపత్ వినాయకుని గుడి ఆవరణలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తిరుపతికి చెందిన ఆధ్యాత్మిక వేత్త రాధా మనోహర్‌దాస్ ఆధ్వర్యంలో కార్తీక వైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో భారీ కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ఆకృతుల్లో వెలిగించిన దీపాలు చూడముచ్చటగా భక్తులు వెలిగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. పైడిపర్రులోని శ్రీ బాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

శ్రీఉమాసిద్దేశ్వరునికి అభిషేక పూజలు

అత్తిలి: కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా మండలంలో శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. వేకువజామునుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని అభిషేక పూజలు జరిపారు. అత్తిలిలో గల ఉమాసిద్దేశ్వరస్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

చంద్రశేఖర్ స్వామికి విశేష అభిషేకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక మాసం సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో సోమవారం సందర్భంగా ఉమా చంద్రశేఖర్‌స్వామికి పసుపు, కుంకుమలతో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, ఫలారసాలతో విశేషంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నున్న బాలా త్రిపుర సుందరరావు, పూర్వాధ్యక్షుడు పేరూరి కాశయ్య, ఆలపాటి చిన్న, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో

పట్టణంలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో సోమవారం కార్తీక మాసం సందర్భంగా శ్రీకృష్ణపరమాత్మకు, చింతామణిదేవి, దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలో 50 మంది మహిళా భక్తులచే కార్తీక దీపాలతో శోభాయాత్ర జరిగింది. కాకర్ల ధనలక్ష్మి, రమ్య, రూపాలావణ్య, వెంకట లక్ష్మి, మంగాదేవి, మాధవి, రమాదేవి పాల్గొన్నారు.